## ఎస్ఐఆర్ ఫారాలు 9లోగా బీఎల్ఓలకు అందించాలి: మహమ్మద్ జమీరోద్దీన్



**దశ, రామన్నపేట:** ఎస్ఐఆర్ ఫారాలు అందుకున్న వారు వాటిని పూర్తిచేసి, గుర్తింపు ధ్రువీకరణకు సంబంధించిన జిరాక్స్ కాపీని జతచేసి ఈ నెల 9వ తేదీలోగా బీఎల్ఓలకు అందజేయాలని రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరోద్దీన్ సూచించారు. రామన్నపేట మండలం విజ్ఞాన వర్ధిని ఐటీఐలో ఎస్ఐఆర్ ఫారాలను నోటీసులు అందుకున్న వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, మహమ్మద్ కరీం, ఎండీ మన్నాన్, అక్కనేపల్లి జయకృష్ణ, తావ సంతోష్, ఎంకే రాహుల్, నంగునూరు విజయ్, బీఎల్ఓలు కవిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరంలో సురక్షిత తాగునీటి ఆర్వో ప్లాంట్ ప్రారంభం

❖ *కోరమండల్ సహకారంతో గ్రామస్థులకు శుద్ధమైన నీరు*



**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. కోరమండల్ సంస్థ గ్రామాన్ని దత్తత తీసుకుని ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గర్దాస్ విక్రమ్, ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, వినయ్ పరిడా, కంపెనీ ప్రతినిధులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి.

## షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణంలో మంటలు

❖ *కమ్మగూడ లక్ష్మీనగర్‌లో ఘటన.. రూ.1.50 లక్షల వరకు నష్టం*



**దశ, ఆదిభట్ల:** ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలోని కమ్మగూడ లక్ష్మీనగర్ కాలనీలోని లక్ష్మి కిరాణా దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు వాటిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.1.50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ యాదగిరి వెల్లడించారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందే




**దశ, రంగారెడ్డి :** పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రంగారెడ్డి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఈ నెల 10న నిర్వహించనున్న హైదరాబాద్ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ప్రస్తుతం దానిపై జాప్యం చేయడం సరికాదని అన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహ కన్వీనర్ శ్రీనేష్ కుమార్ నోరి, సహ చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతిశ్రీ, సుధాకర్, రాజేష్, బల్వంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, కార్యదర్శులు మాధవ్, ఆనంద్, మహేష్, ప్రమీల, వెంకటప్ప, పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ, అరుణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి


**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టిన నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. తహశీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, ఇతర శాఖలకు చెందిన సీపీఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుపై ఇప్పటికే జాప్యం జరిగిందని, ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రాష్ట్రంలోని అన్ని శాఖల ఉద్యోగులతో భారీ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సీపీఎస్ రద్దుతో పాటు వేతన సవరణ సంఘం అమలు, ఆరు డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుజిత్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మహేష్, రాంబాబు, గ్రామ పరిపాలన అధికారులు సుప్రియ, స్వాతి, శైలజ, దయానంద్, రాకేష్, హన్మంత్, ముఖేష్, మమత, కవిత, రేణు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ నుంచి హెచ్‌పీసీఎల్‌లో కొలువు.. శభాష్ సాయి చరణ్!

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** పేద కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు పట్టుదలతో చదివి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం సాధించాడు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ బ్లాక్ నంబర్ 38లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న చిలుకల సాయి చరణ్ హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యాడు. సాయి చరణ్ తండ్రి సందీప్ కుమార్ క్యాబ్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన సాయి చరణ్.. పట్టుదలతో మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాడు. ప్రస్తుతం మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న సాయి చరణ్.. ఈ ఏడాది హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చేపట్టిన నియామక ప్రక్రియలో అత్యుత్తమ ర్యాంకు సాధించి జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యాడు. తన విజయానికి సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిక్కర గోపీ శంకర్ యాదవ్ అందించిన మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడిందని సాయి చరణ్ తెలిపారు. శిక్షణ నిమిత్తం భువనేశ్వర్‌కు వెళ్తున్న సందర్భంగా సురక్ష కార్యాలయంలో గోపీ శంకర్ యాదవ్ సాయి చరణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీలోని యువత సాయి చరణ్‌ను ఆదర్శంగా తీసుకుని విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గోపీ శంకర్ యాదవ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సురక్ష సభ్యులు యాకూబ్, సందీప్ కుమార్ పాల్గొన్నారు.



# పదవీవిరమణ బాధ్యతకే ముగింపు.. సేవలకు కాదు



❖ *పంచాయతీరాజ్ డీఈ ఇంద్రసేనారెడ్డి సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి*

**దశ, పెద్దఅంబర్‌పేట్:** ప్రభుత్వ ఉద్యోగంలో అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు సేవలందించిన పంచాయతీరాజ్ శాఖ డీఈ ఇంద్రసేనారెడ్డి సేవలు అభినందనీయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట్‌లో ఇంద్రసేనారెడ్డి పదవీవిరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం కేవలం పదవి, హోదా మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇంద్రసేనారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీవిరమణ అనేది ఒక బాధ్యతకు మాత్రమే ముగింపని, సమాజానికి అందించిన సేవలకు ముగింపు కాదని పేర్కొన్నారు.

పదవీవిరమణ అనంతరం ఇంద్రసేనారెడ్డి కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన అనుభవం, సేవా స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇంద్రసేనారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి, వారి పదవీవిరమణ జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు.

## జోనా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

❖ *పేదల వైద్య సేవలకు ఉచిత అంబులెన్స్ అందించడం గొప్ప కార్యక్రమం*



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** పేదలు, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జోనా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ దంపతుల కుమారుడు గండూరి జోనా 6వ వర్ధంతి సందర్భంగా అంబులెన్స్ రెండు ఫ్రీజర్ బాక్స్ లు అక్షర ఫౌండేషన్ వాళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జోనా వర్ధంతిని పురస్కరించుకుని పేదల కోసం రూ.26 లక్షల వ్యయంతో ఉచిత అంబులెన్స్‌ను, రూ.1.80 లక్షల వ్యయంతో రెండు ఫ్రీజర్ బాక్సులను అందించడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమన్నారు. అత్యవసర సమయాల్లో పేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. సుమారు 330 మంది పేదలకు ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సేవాభావంతో చేపట్టే ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని, సమాజంలోని పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉచిత అంబులెన్స్, రెండు ఫ్రీజర్ బాక్సులను అక్షర ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు.

## ఘనంగా కె సి గుప్త 107 వ జయంతి వేడుకలు



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** స్వాతంత్ర సమరయోధుడు, వాసవి క్లబ్ వ్యవస్థాపకులు, ఆర్యవైశ్య ముద్దుబిడ్డ కల్వకుంట్ల చంద్రసేన్ గుప్త 107 వ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కెసిగుప్తా చౌరస్తాలో జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది పాల్గొని కెసి గుప్తా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసి గుప్త స్వతంత్ర పోరాటంలో క్విట్ ఇండియాఉద్యమంలో పాల్గొన్నారని, అలాగే వాసవి క్లబ్ 9 మందితో స్థాపించారని, ఈ రోజు లక్ష మందితో వాసవి క్లబ్ నడుస్తుందని వారు అన్నారు. వారు స్థాపించిన వాసవి క్లబ్ నేడు వందలాదిమంది చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ , రాష్ట్ర నాయకులు తప్పి గాంధి, బండారు రాజా, యమా సంతోష్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, ఆర్యవైశ్య నాయకులు సింగిరికొండ రవీందర్, కర్నాటి కిషన్, తోట శ్యామ్ ప్రసాద్, కలకోట లక్ష్మయ్య, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మయ్య, మీలా వంశీ, పోతుగంటి వెంకటేశ్వర్లు, బ్రాహ్మాండ్లపల్లి మురళీధర్, రాచకొండ శ్రీనివాస్, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, మిట్టపల్లి రమేష్, సుమన్ వెంకన్న, పబ్బతి వేణుమాధవ్, శ్రీరంగం రాము, మంచాల శ్రీనివాస్ గుప్తా, వంగవీటి రమేష్, నవిలిపుపురి నరేందర్, వుప్పలంచు కృష్ణ, ఓరుగంటి లావణ్య, ఓరుగంటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకు జాతీయ గౌరవం






❖ బండోనిగూడ సర్పంచ్ జెట్టా కుమార్‌కు భారతీయ స్ఫూర్తి సేవా రత్న జాతీయ పురస్కారం

**దశ, ఓయూ:** ప్రజాసేవ, గ్రామీణాభివృద్ధి, విద్య, యువత, సామాజిక చైతన్యం, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న రంగారెడ్డి జిల్లా బండోనిగూడ గ్రామ సర్పంచ్ జెట్టా కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన 'భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ పురస్కారం' లభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ జాతీయ అవార్డును జెట్టా కుమార్‌కు ప్రదానం చేశారు.

సమాజం పట్ల బాధ్యతతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడటం, యువతను సామాజిక సేవ వైపు ప్రోత్సహించడం, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసినట్లు స్ఫూర్తి ఎన్జీవో నిర్వాహకులు తెలిపారు.

### సేవా స్ఫూర్తికి గుర్తింపు

జెట్టా కుమార్ తన రాజీకీయ, సేవా ప్రయాణంలో ప్రజలతో మమేకమై పనిచేస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహం, యువతలో నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ఆయన చూపుతున్న చొరవకు గానూ ఇప్పటికే పలు ప్రశంసలు, అవార్డులు సొంతం చేసుకున్నారు. 'సమాజానికి మనం ఏమిచ్చామన్నదే మన జీవితానికి అసలైన అర్థం, పరమార్థం' అన్న భావనతో ముందుకు సాగుతున్న జెట్టా కుమార్ కు ఈ అవార్డు మరింత గుర్తింపును తీసుకొచ్చింది.

### ప్రజాసేవే పరమావధిగా..

'భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ పురస్కారం' అందుకున్న సందర్భంగా జెట్టా కుమార్ మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని తన వ్యక్తిగత విజయంగా కాకుండా తనతో కలిసి ప్రజాసేవలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. ప్రజల ఆశీస్సులు, అభిమానమే తనకు అతిపెద్ద బలమని తెలిపారు. "ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతతో ముందుకెళ్లాలన్న విషయాన్ని గుర్తు చేసిందని, ప్రజల కోసం చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను మరించ విస్తృతంగా కొనసాగిస్తూ, అందరికీ స్ఫూర్తిగా నిలిచే విధంగా పనిచేయడమే తన లక్ష్యమని, సమాజానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని" ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

జెట్టా కుమార్‌కు "భారతీయ స్ఫూర్తి సేవా రత్న" జాతీయ పురస్కారం లభించడంతో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ప్రముఖులు, కుటుంబ సభ్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో స్ఫూర్తి ఎన్జీవో వ్యవస్థాపకులు డాక్టర్ ఆకుల రమేష్, స్ఫూర్తి సర్వీసెస్ ప్రధాన సలహాదారు డాక్టర్ గూడూరి చిన్నారెడ్డి, నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సేవకు సత్కారం.. స్ఫూర్తికి సన్మానం

జెట్టాకుమార్‌కులభించిన "భారతీయస్ఫూర్తిసేవా రత్న నేషనల్ అవార్డు" ఆయన సేవా ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం, సేవా సంకల్పానికి ఈ పురస్కారం ప్రతీకగా నిలిచింది. అదే సమయంలో, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో, అంకితభావంతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు ఈ గౌరవం ఆయనకు కొత్త స్ఫూర్తిని అందించింది. ప్రజాసేవకు లభించిన ఈ గుర్తింపు కేవలం ఒక వ్యక్తికి దక్కిన అవార్డు మాత్రమే కాదు.. సేవా మార్గాన్ని ఎంచుకుని సమాజం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఇది ఒక స్ఫూర్తిదాయక సందేశం. సమాజానికి మన వంతు సేవ చేయాలనే సంకల్పానికి గుర్తింపుతో పాటు, మరెందరో సేవా మార్గంలో ముందుకు సాగేందుకు ఈ పురస్కారం ప్రేరణగా నిలుస్తోంది.

## లేబర్ కార్యాలయ జాప్యంపై కార్మిక సంఘం ఆగ్రహం



**దశ: రామన్నపేట:** రామన్నపేట సహాయ కార్మిక కార్యాలయంలో గత రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొరిగే సోములు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివాహం, ప్రసూతి, ప్రమాదం, మరణం, విద్య తదితర సంక్షేమ పథకాలకు సంబంధించిన క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెల 10లోగా సమస్యను పరిష్కరించకపోతే సహాయ కార్మిక కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బుడ్డ ప్రసాద్, గొరిగే మల్లేష్, నూకల సైదులు, తరిగొప్పుల వెంకట్‌రెడ్డి, బక్కిని చెన్నయ్య, వల్లం నాగరాజు, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఫేజ్–2పై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



**దశ ఓయూ:** ఓటర్లకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) రెండో దశ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు మాణికేశ్వరి నగర్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు దీపక్‌జాన్ ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐఆర్ ఫేజ్-2లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతోపాటు, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు గండికోట కుమార్ తెలిపారు. ఓటర్లు తమకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం బీఎల్ఏల పనితీరును పరిశీలించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## మిర్చి యార్డ్ సందర్శించిన పెబ్బేరు కాంగ్రెస్ నాయకులు

**దశ, పెబ్బేర్:** వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ టూర్‌లో భాగంగా పాలకవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించారు. ఈ సందర్భంగా గుంటూరు మిర్చి యార్డును పరిశీలించి, రైతులకు లాభదాయకంగా ఉండే పంటల కొనుగోలు విధానం, ఈనామ్ ద్వారా వేలం నిర్వహించే ప్రక్రియపై అక్కడి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గుంటూరు మార్కెట్‌లో అమలవుతున్న విధానాలను పరిశీలించడం ద్వారా పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి అవసరమైన పలు అంశాలపై అవగాహన కలిగిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు మోతే రాములు, నరసింహనాయుడు, రామన్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి, వెంకటేష్‌సాగర్, సురేందర్ గౌడ్, బూరమోని రాములు, భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ముందస్తు అరెస్ట్

**దశ ఓయూ:** నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి నివాసం, జిల్లా పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని ఖండిస్తూ, ఆయనను పరామర్శించేందుకు నల్గొండకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును పోలీసులు మంగళవారం ఆయన నివాసం వద్ద ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామచందర్‌రావుకు మద్దతుగా అక్కడికి చేరుకున్న పలువురు బీజేపీ నాయకులను కూడా పోలీసులు అరెస్టు చేసి లాలాగూడతో పాటు ఇతర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్‌తో పాటు రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాస్, రామ్‌వర్మ, సురేష్‌గౌడ్, గడ్డం సాయి, సుబ్బారావు తదితర నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఏబీవీపీ

**దశ, ఓయూ:** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన రూ.11 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకుని విద్యార్థి నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఏబీవీపీ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు గెల్లు శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మంది విద్యార్థులతో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృధ్వితేజ, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, రాష్ట్ర మీడియా కన్వీనర్ దృహన్, స్టేట్ యూనివర్సిటీస్ కోకన్వీనర్ గంధం నరేందర్, విద్యానగర్ జిల్లా కన్వీనర్ సాయి తేజ, స్టేట్ లా ఫోరం కోకన్వీనర్ వెంకటేష్, సిటీ జాయింట్ సెక్రటరీ దినేష్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అజయ్, తన్మయి, విజయ్‌సింగ్, మోహన్‌బాబు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎల్ఐసీ 70వ వార్షికోత్సవ వేడుకలు

**దశ ఓయూ:** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 70వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం హైదరాబాద్‌లోని సౌత్ జోనల్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన సౌత్ జోనల్ కార్యాలయంలో జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వాసవి కన్స్ట్రక్షన్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యర్రం విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యర్రం విజయకుమార్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ మరింత అభివృద్ధి చెంది త్వరలో శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, మార్కెటింగ్ ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్ల సేవలను అభినందించారు. ఎల్ఐసీ విశ్వాసం, భరోసా, ఆర్థిక భద్రతకు ప్రతీకగా నిలిచిందన్నారు. పిల్లల భవిష్యత్తు, విద్య, ఉన్నత విద్య, వివాహం, కుటుంబ ఆర్థిక భద్రతతో పాటు పదవీ విరమణ అనంతర జీవితానికి ఎల్ఐసీ పాలసీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఏళ్లుగా ఎల్ఐసీపై విశ్వాసంతో తమ కష్టార్జితాన్ని పొదుపు చేసుకుంటున్న కోట్లాది మంది పాలసీదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొటికె విఠల్ మాట్లాడుతూ.. ఎల్ఐసీకి అసలైన బలం జీవిత బీమా, సంస్థతో అనుబంధం కలిగిన ఏజెంట్లేనన్నారు. ఏజెంట్లు సంతృప్తిగా, ఉత్సాహంగా పనిచేసినప్పుడే సంస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన రీజినల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉద్యమానికి ఆశ్రయం.. అభివృద్ధిలో శూన్యం





❖ ఓటు బ్యాంక్‌గా 'వడ్డేర బస్తీ'.

**దశ, ఓయూ:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కేంద్రీకృతమైన ఉస్మానియా యూనివర్సిటీ పక్కనే ఉన్న మాణిక్యేశ్వర్ 'వడ్డేర బస్తీ' తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఒకప్పుడు ఉద్యమకారులకు రక్షణగా నిలిచి, స్వచ్ఛందంగా పోరాటంలో పాల్గొన్న ఈ బస్తీ ప్రజలు.. నేడు ప్రాథమిక అభివృద్ధికి కూడా నోచుకోక అవస్థలు పడుతున్నారు. రాజకీయ పార్టీల ఓటు బ్యాంక్ రాజకీయాలకు బలైపోతున్న వడ్డేర బస్తీపై టీవీ ప్రత్యేక కథనం... మట్టి నుంచి వెలసిన ఉస్మానియా యూనివర్సిటీ నిర్మాణానికి, తదనంతర అభివృద్ధికి సేవలు అందించిన చరిత్ర మానికేశ్వర్ నగర్ వడ్డేర బస్తీది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఈ బస్తీ ఓ సురక్షితమైన ఉద్యమ కేంద్రంగా మారింది. పోలీసుల నిర్బంధాల నడుమ ఉద్యమకారులకు షెల్టర్ ఇచ్చి, పోరాటాన్ని కాపాడటంలో ఇక్కడి ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొని కీలక పాత్ర పోషించారు..

ఈ బస్తీలో నివసించే వారిలో అత్యధికులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన దినసరి కూలీలే. కష్టపడితేనే కానీ కడుపు నిండని పరిస్థితి వీరిది. అయితే వీరి అమాయకత్వాన్ని, ఓట్లను రాజకీయ నాయకులు తమ స్వార్థానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ఈ బస్తీని రాజకీయ నాయకులు, అధికారులు తమ అవసరాలకు తగ్గట్లు మార్చేశారు. దాదాపు 40 వేల జనాభా కలిగిన ఈ ప్రాంతానికి కనీస వైద్యం అందించే సౌకర్యం లేకపోవడం చాలా దారుణం. బస్తీలో 100 పడకల ఆసుపత్రి నిర్మించాలంటూ బస్తీ వాసులంతా దాదాపు 150 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇలా అనేక మంది నాయకులు వచ్చి హామీ ఇచ్చి వెళ్లారు తప్ప హాస్పిటల్ కోసం ఒక అడుగు ముందుకు పడలేదు. మాణికేశ్వర్ నగర్ నుంచి వారసు గూడా వెళ్లేందుకు ప్రతిపాదించిన ఆర్ యు బి నిర్మాణం పెండింగ్ లోనే ఉంది.

* గతంలో: అంబర్‌పేట నియోజకవర్గం
* తర్వాత: ముషీరాబాద్ నియోజకవర్గం
* ప్రస్తుతం: సికింద్రాబాద్ నియోజకవర్గం

గతంలో అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న ఈ బస్తీని.. ఆ తర్వాత ముషీరాబాద్‌లోకి, ప్రస్తుతం సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోకి మార్చారు. ఓట్ల కోసం బస్తీ సరిహద్దులు మారుస్తున్నారే తప్ప, గెలిచిన తర్వాత ఏ ఒక్క నాయకుడు కూడా ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు రాగానే హామీల వర్షం కురిపించి, గెలిచాక పత్తా లేకుండా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమానికి ప్రాణం పోసిన బస్తీకి నేడు అభివృద్ధి కరువైంది. ఓట్ల కోసం తమ ప్రాంతాన్ని పావుగా వాడుకుంటున్న పాలకులకు బుద్ధి చెబుతామని బస్తీవాసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వడ్డేర బస్తీని అభివృద్ధి బాట పట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తక్షణమే హాస్పిటల్ నిర్మాణం ప్రారంభించాలి. మధ్యలో ఆగిపోయిన ఆర్ యు బి పనులను పూర్తి చేయాలని మాణిక్యేశ్వరి బస్తి వాసులు కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్, కె. యాదయ్య, పి. చిరంజీవి, ఈ. నరసింహ, ఓర్సు శ్రీనివాస్, జి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.